సంక్షేమంతో వైఎస్సార్ సీపీ విజయం


వాలు తిమ్మాపురంలో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న దొరబాబు


వాలు తిమ్మాపురంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులను సాదరంగా ఆహ్వానిస్తున్న దొరబాబు


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో దవులూరి దొరబాబు తదితరులు

- స్థానికుడిగా గెలిపించాలన్న దవులూరి
- వాలు తిమ్మాపురంలో ఎన్నికల ప్రచారం

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజా బలం వెన్నుదన్నుగా నిలుస్తుందని, రాష్ట్రంలో జరిగిన సంక్షేమాభివృద్ధే వైఎస్సార్ సీపీ విజయానికి నాంది అని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు కోరారు. విజయ సంకల్పయాత్ర పేరిట బుధవారం మండలంలోని వాలు తిమ్మాపురంలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. గ్రామ పార్టీ నాయకులు పురందాసు చిన రాజులు, బచ్చల రాజు, పురందాసు అన్నవరం, ఎంపీటీసీ రాయి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్థానికుడిగా తనను ఆదరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని దొరబాబు కోరారు. ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరో దఫా వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. స్థానికంగా ప్రజా సమస్యలపై పూర్తి అగాహన ఉందని తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా, ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, ఎంపీపీ పెంకే సత్యవతి. వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పులిమేరు సొసైటీ అధ్యక్షులు గోపు మురళి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మండల కన్వీనర్ గోపు మురళి తదితరులు పాల్గొన్నారు.

వంద మంది చేరిక

పెద్దాపురం: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలు నచ్చి మరోసారి జగన్‌ను సీఎంగా చూసేందుకు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో భారీగా చేరుతున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని రాయభూపాలపట్నం, వాలుతిమ్మాపురం గ్రామాల్లో బుధవారం సుమారు వంద టీడీపీ, జనసేన కార్యకర్తలు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఆర్బీ పట్నానికి చెందిన గుణ్ణం రామ్మోహన్‌తో పాటు వాలుతిమ్మాపురంకు చెందిన 70 బీసీ కుటుంబాలకు చెందిన బీసీ సోదరులు పురందాసు చినరాజుల ఆధ్వర్యంలో పార్టీలోకి ఆహ్వానించారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురం శివారు ప్రాంతమైన కొత్తూరుకు చెందిన సుమారు 60 కుటుంబాలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. మాజీ ఎంపీటీసీ సభ్యుడు గోనుపాటి మాధవస్వామి, కామరాజు, తేలు శ్రీను, కింతల చిరంజీవి, గుర్రపు సుశీల తదితరులతో మరో 60 మంది పార్టీలో చేరారు. వారికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, మాజీ ఎంపీటీసీ వెలమర్తి బుల్లిరాజు, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సోషల్ పరీక్షకు 89 మంది డుమ్మా

సామర్లకోట: పదో తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం సోషల్ పరీక్షకు 89 మంది డుమ్మా కొట్టినట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన పరీక్షల్లో భాగంగా మండల పరిధిలోని 9 పరీక్షా కేంద్రాల్లో 1603 మంది రెగ్యులర్ విద్యార్థులు, 200 మంది ప్రైవేటు విద్యార్థులు సోషల్ పరీక్ష రాయాల్సి ఉంది. రెగ్యులర్ విద్యార్థులు 16 మంది, ప్రైవేటు విద్యార్థులు 73 మంది గైర్హాజరయ్యారు. బుధవారంతో పరీక్షలు ముగిశాయని ఎంఈఓ తెలిపారు. అయితే సంస్కృతం ఉన్న వారికి 30వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని చెప్పారు.

అనాథపై రైల్వే ఉద్యోగి ఔదార్యం


వృద్ధునికి క్షవరం చేస్తున్న పార్శిల్ కార్యాలయ ఉద్యోగి బాషా

సామర్లకోట: స్థానిక రైల్వేస్టేషన్‌లో రెండు రోజులుగా అనాథగా పడి ఉన్న ఒక వ్యక్తికి రైల్వే సిబ్బంది సపర్యలు చేసి సంస్కరించారు. ఆకలితో అలమటిస్తున్న అతనిని పార్శిల్ విభాగం ఉద్యోగి బాషా గుర్తించి బుధవారం బాగా పెరిగిన జుట్టును, గెడ్డాన్ని శుభ్రం చేసి అనంతరం ఆకలి తీర్చారు. అతని ఊరు పేరు చెప్పలేక పోవడంతో పాటు కాలికి గాయం తగలడంతో చికిత్స నిమిత్తం ఆటోలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది సాయంతో కాకినాడ ఆస్పత్రి తరలించారు. బాషా సేవలను రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అభినందించారు.

వాహనాల తనిఖీ


మాధవపట్నం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు ముమ్మరం చేశారు. వారిని మూడు బృందాలుగా విభజించి అనుమానిత వాహనాలను తనిఖీ చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సురేష్ ఆధ్వర్యంలో కాకినాడ రోడ్డులో మాధవపట్నం వద్ద వాహనాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులలో నగదు వెంట తీసుకువెళ్లే సమయంలో పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు అనుమతి తీసుకోవాలని తెలిపారు. శుభకార్యాలు, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లే వారు వెంట నగదు తీసుకొని వెళ్లే సమయంలో తగిన ఆధారాలు ఉండాలన్నారు. అనుమతి లేకుండా నగదు, మద్యం వాహనాలలో ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మాధవపట్నం గ్రామాల్లో ఎన్నికల కోడ్ నిబంధనలను రాజకీయ పార్టీ నాయకులకు వివరించారు.

మన పెద్దాపురంలో 'మాతృత్వం'


ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు భోజనం అందిస్తున్న మన పెద్దాపురం సభ్యులు

పెద్దాపురం: సేవే పరమావధిగా మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం మరో ముందడుగు వేసింది. సంస్థ స్థాపించి 9 ఏళ్లు ముగిసిన నేపథ్యంలో బుధవారం ఏరియా ఆసుపత్రిలో రోగులకు మాతృత్వం పేరిట అన్నదానాన్ని ప్రారంభించారు. ఫేస్‌బుక్ టీం అడ్మిన్ నరేష్ పెదిరెడ్డి మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి బుధవారం ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు మాతృత్వం పేరిట ఉచితంగా భోజనం అందించనున్నట్టు తెలిపారు. తొలిరోజు సుమారు 120 మందికి ఉచితంగా భోజనం అందించారు. తొలుత ఆసుపత్రి వైద్యులు జగదాంబ, శ్రీనివాస్, అనూష చేతుల మీదుగా భోజనం వడ్డించారు. సంస్థ అధినేత రవి, దేవత రాజేష్‌కుమార్, చందు, కర్రి శివ, భుజంగరావు, హర్ష, లక్ష్మణ్, నవీన్ నాని, చవ్వాకుల సాయి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవత, సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

కరప: మండలం విజయరాయుడుపాలెంలో పునర్నిర్మించిన ఆలయాల్లో బుధవారం గ్రామ దేవత గోగులమ్మతల్లి, సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామస్తుల వినతి మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షలు వంతున మంజూరు చేయగా ఆలయాలను నిర్మించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పార్టీ నాయకులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, పూజలుచేశారు. ఆలయ కమిటీ సభ్యులు బొండా సూర్యనారాయణ (చంటిబాబు), పేపకాయల పుల్లేశ్వరరావు తదితర గ్రామస్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళల ఆర్థికాభివృద్ధిపై విద్యార్థులకు శిక్షణ


మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశమైన విద్యార్థులు

పిఠాపురం: కొత్తపల్లి మండలం ఉప్పాడ మత్స్యకార మహిళా సమాఖ్యలో మహిళల ఆర్థికాభివృద్ధిపై ఐఐఎఫ్‌టీ విద్యార్థులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. మత్స్యకార సమాఖ్యలో గ్రామాల అభివృద్ధి, మహిళల పాత్రపై మూడు రోజుల పాటు స్వయం సహాయక సంఘాలు, వాటి ఏర్పాటు తదితర విషయాలపై విద్యార్థులు అధ్యయనం చేయనున్నారు. సంఘాల ఏర్పాటుతో పాటు, సభ్యుల స్థితిగతులు, గ్రామాల్లోని విద్య, ఆరోగ్యం తదితర విషయాలపై అవగాహన కల్పించనున్నారు. కాకినాడ ఐఐఎఫ్‌టీ కళాశాలకు చెందిన బీబీఎం, ఎంబీఏ విద్యార్థులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఢిల్లీ, కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు ఈ బృందంలో ఉన్నారు. ట్రాన్స్‌లేటర్ ఎం.జగదీశ్వరి, ఎస్.పైడితల్లి, ఏపీఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న చలమలశెట్టి సునీల్


గోమాతను పూజిస్తున్న వంగా గీత

గొల్లప్రోలు: చిన జగ్గంపేట గ్రామంలో అమ్మా జగదీశ్వరీ ఆలయంలో బుధవారం ఉదయం ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం సర్పంచ్ వమ్మి వీరలక్ష్మి, గ్రామస్తుల సహకారంతో వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. చలమలశెట్టి సునీల్, వంగా గీత అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయం వద్ద చెరుకూరి కృష్ణంరాజు జంపన ప్రసాద్‌వర్మ ఆర్థిక సహకారంతో భారీ అన్న సమారాధన జరిగింది. జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్య దొర, ఎంపీటీసీ గాది అప్పారావు, పార్టీ నాయకులు మల్లికార్జున్, దాసం వెంకటేష్ పాల్గొన్నారు.

పెద్దాపురంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తాం

భారతమాత సేవా పరిషత్ అధ్యక్షుడు చిన్నయ్యదొర


విలేకర్ల సమావేశంలో మాట్లాడిన చిన్నయ్యదొర

సామర్లకోట: కాకినాడ జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకమైన పెద్దాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని భారతమాత సేవా పరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, జై భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర అన్నారు. మంగళవారం సీఎం జగన్ సమక్షంతో వైఎస్సార్ సీపీలో చేరిన ఆయన బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సేవా సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామని అన్నారు. నిస్వార్థ పరులైన ఎంపీ అభ్యర్థి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబులను గెలిపించుకోవలసిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. ఉమ్మడి రాష్ట్ర కౌన్సిల్ చాంబర్ అధ్యక్షుడిగా పని చేయడం వలన రాష్ట్ర వ్యాప్తంగా అనేక మందితో పరిచయాలు ఉన్నాయని, దాంతో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ తరపున ప్రచారం చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై కక్షకట్టి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడినా జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఒంటరిగా పోరాడడం అభినందనీయమన్నారు. దొరబాబు విజయానికి నియోజకవర్గంలో ప్రచారం చేస్తానన్నారు. చిన్నయ్యదొరను దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను సత్కరించారు.

గొంచాలలో ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు


గొంచాల ఆలయం వద్ద భోజన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సునీల్

సామర్లకోట: మండల పరిధిలో గొంచాల గ్రామంలో శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమాలల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబులు ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. స్వామి వారి అమ్మవారి విగ్రహాలను భక్తుల ఊరేగింపుగా శారదాదేవి ఆలయం వద్ద ఉన్న కోనేరులో నిమజ్జనం చేశారు. ఏడు రోజుల పాటు సప్తాహంలో పాల్గొన్న దంపతులు పూర్ణాహుతిలో పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నదానం చేయగా భోజన ఏర్పాట్లను సునీల్ పర్యవేక్షించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ చోడిశెట్టి వెంకటరమణ, వైస్ ఎంపీపీ పేర్పిడి వెంకట్రాయుడు తదితరులు భక్తులకు సేవలు అందించారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలకు సహకరించాలి

డీఎస్పీ లతాకుమారి


పులిమేరులో యువతకు అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

పెద్దాపురం: స్వేచ్ఛాయుత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు గ్రామీణ ప్రజలు సహకరించాలని డీఎస్పీ లతాకుమారి అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మంగళవారం మండలంలోని పులిమేరులో ఎస్ఐ వెలుగుల సురేష్ ఆధ్వర్యంలో పోలీస్ కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహన అవసరమన్నారు. కోడ్ అమలులోకి రాగానే పోలీస్ యంత్రాంగం చేపట్టే విధి విధానాలకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రశాంత వాతవారణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని వీధుల్లో పోలీస్, బెటాలియన్ సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై దృష్టిపెట్టండి

- పారిశుధ్య పనులు మెరుగుపర్చాలి
- 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయండి
- పెద్దాపురం మండల సమీక్షలో పీఆర్ కమిషనర్ కన్నబాబు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్ కమిషనర్ కన్నబాబు

పెద్దాపురం: ప్రస్తుత వేసవి దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడిపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కె.కన్నబాబు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఉపాధి హామీ, పంచాయతీ, సచివాలయ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఎంపీడీఓ జి.ఉషారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీఆర్ కమిషనర్ కన్నబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు మరింత మెరుగుపర్చాలన్నారు. తడి, పొడి చెత్తల సేకరణతో పాటు సంపద తయారీ కేంద్రాల నిర్వహణ మెరుగుపరచాలన్నారు. పంచాయతీ ఆదాయ వనరులపై దృష్టి సారించి పంచాయతీల అభివృద్ధిపై చర్యలు చేపట్టాలన్నారు. చాలా పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయడం లేదని, సత్వరమే వాటిని వినియోగించి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. జీపీడీపీ నిర్వహణపై సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి మెరుగైన పాలన అందించాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ శ్రీరామచంద్రమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి భారతిసౌజన్య, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డీఎల్‌పీఓ బాలామణి, ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, డీఎల్‌డీఓ కేఎస్‌పీ ప్రసాద్, పెద్దాపురం, కాకినాడ డ్వామా ఏపీడీలు భాను ప్రకాష్, వసంతమాధవి, రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అప్పలరాజు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సత్యనారాయణమూర్తి, ఏపీఓ రాజుబాబు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం


వృద్ధులను పరీక్షిస్తున్న వైద్యులు

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి సంతోషనగర్‌లో రెడ్‌క్రాస్ వృద్ధాశ్రమంలో బర్రి నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు సుదర్శనరెడ్డి, సాయి, చాందిని రోగులను పరీక్షించి ట్రస్టీ ఎస్‌వీవీ తాతారావు చేతులు మీదుగా మందులు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, వీఎస్ఎన్ మూర్తి, రామారావు, శ్రీనివాసరావు, రామకృష్ణ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ

కాకినాడ: వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అవసరమైన ముందస్తు కార్యాచరణను సిద్ధం చేసినట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. బుధవారం సాయంత్రం ఆయన సామర్లకోటలోని వేసవి జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లో నీటి నిల్వలపై ఆరా తీశారు. రిజర్వాయర్ సామర్థ్యం ఎంత? ప్రస్తుతం నీటి నిల్వలు ఏ మేరకు ఉన్నాయి? ప్రజలకు సమృద్ధిగా నీరందించడానికి తీసుకోవలసిన చర్యలుపై అధికారులతో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా రూ.1.28 కోట్లతో వేసవి కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. అవసరమైతే అదనపు నీళ్ల ట్యాంకర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వేసవి తీవ్రతను బట్టి ముఖ్య ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్ఈ పి.సత్యకుమారి, ఈఈ మాధవి, డీఈ శ్రీనివాస్, ఏఈ సాంబశివరావు తదితరులు ఉన్నారు.

సృజనకు వేదిక

- జేఎన్‌టీయూకేలో ఇన్నోవేషన్ ఫెయిర్ ప్రారంభం
- ప్రాజెక్టులతో మెప్పించిన ఇంజినీరింగ్ విద్యార్థులు
- 150కి పైగా ప్రాజెక్టుల ప్రదర్శన


ప్రాజెక్టుల స్టాల్‌ను సందర్శించి, వివరాలు అడుగుతున్న నన్నయ వర్సిటీ వీసీ పద్మరాజు, జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): తమ ఆలోచనలకు సాంకేతికత జోడించి నూతన ఆవిష్కరణకు నాంది పలికారు ఇంజినీరింగ్ విద్యార్థులు. కాకినాడ జేఎన్‌టీయూకేలో రెండు రోజుల పాటు నిర్వహించే ఇన్నోవేషన్ ఫెయిర్ బుధవారం ప్రారంభమైంది. ఇందులో వర్సిటీ అనుబంధ కళాశాలలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ ప్రాజెక్టులు ప్రదర్శించి సందర్శకులను ఆలోచింపజేశారు. వర్సిటీ డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎ.గోపాలకృష్ణ ఆధ్వర్యాన ప్రారంభమైన ఈ ఫెయిర్‌లో 150కు పైగా ప్రాజెక్టులు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా నన్నయ వర్సిటీ వీసీ డాక్టర్ కొప్పిరెడ్డి పద్మరాజు, జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు హాజరై ప్రారంభించారు. మొదటి మూడు స్థానాల్లో నిలచిన విజేతలకు గురువారం సాయంత్ర బహుమతులు అందజేయనున్నారు.

మొదటి ప్రాజెక్టు: పంటకు పట్టిన తెగులు గుర్తించడం



విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు

ఉద్దేశం: నేటి కాలంలో వరిపంట నుంచి మొక్కజొన్న, పెసర, మినుము వంటి వాణిజ్య పంటలకు సంబంధించి మొక్క లేదా ఆకుకు వ్యాధి వచ్చినప్పుడు తొలిదశలో దానిని గుర్తించి, అది విస్తరించకుండా నిర్మూలించడం. అంతేగాక తెగులు సోకిన ఆ ఆకు లేదా మొక్కను స్కాన్‌చేసి ఇంటర్నెట్‌లో వెతికి ఏ రకమైన మందు కొట్టాలో వివరించడం.

విద్యార్థుల బృందం: ఎ.వెంకటేష్, ఎస్.ప్రసూన, ఎం.అనిల్, కె.శృతి. బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల, భట్నపాలెం

ప్రాజెక్టు: కైనటిక్ ఫుట్‌పాత్

ఉద్దేశం: మానవుని నడక ద్వారా విద్యుత్‌ను తయారుచేసి వినియోగించడం. ఉదయం లేదా సాయంత్రం వేళలో ఎక్కువగా ఫుట్‌పాత్‌లపై వాకింగ్ లేదా నడిచే వారి నుంచి నడక ఒత్తిడి నుంచి విద్యుత్‌ను తయారుచేసి దానిని వీధిలైట్లకు వినియోగిచడం.

వాడిన పరికరాలు: 24 వాట్ల బ్యాటరీ, డీసీ మోటర్, సైకిల్ చైన్ స్ప్రోకెట్, ప్లైవుడ్, స్ప్రింగ్, స్ట్రీట్‌లైట్, ప్యాడ్.

విద్యార్థుల బృందం: ఎ.రేవంత్‌కుమార్, ఎం.నాగశ్రీ, విష్ణు ఇంజినీరింగ్ కళాశాల, భీమవరం


విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు

పక్షులకు విడిదిల్లు


పీఠం తోటలో పక్షుల కోసం ఏర్పాటు చేసిన ఆహారం, నీరు


పక్షుల కోసం నీరు పోస్తున్న ఉమర్ ఆలీషా


తొట్టెలో నీటితో దాహాన్ని తీర్చుకుంటున్న పక్షులు



పిఠాపురం: ఎండలు మండుతున్నాయి. పక్షులకు ఆహారం, నీరు దొరకడం కష్టంగా మారింది. మాకు ఆహారమిచ్చి, దాహార్తిని తీర్చండంటూ పక్షులు వేడుకొనే రోజులొచ్చేశాయ్. చెట్లు నీటి చెలమలు ఎండిపోయి, పక్షులకు ఆహారం, నీరు అందని పరిస్థితుల్లో.. కొందరు మహానుభావులు వాటికి అన్నీ అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా, ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ ఆలీషా స్థానిక పీఠం ఆవరణలో పక్షులకు చలివేంద్రం నెలకొల్పారు. ప్రత్యేకంగా తొట్టెలు ఏర్పాటు చేసి, నీరు, ఆహారం పక్షులకు అందుబాటులో ఉంచారు. దీంతో ఎక్కడెక్కడి నుంచో పక్షులు అక్కడకు వచ్చి, తమ ఆకలి దప్పికలను తీర్చుకుని.. కిలకిలా రాగాలు పలుకుతున్నాయి.